ఓం శ్రీ సాయిరాం

ఈ పండితులిద్దరూ నేడు మీకు రామాయణమకరందం అందించారు. రామాయణంలోని సన్నివేశాలు వర్ణిస్తూ ఎంతో నిజమైన ఆనందంతో ప్రసంగించారు. భరద్వాజ మహర్షి భరతునికీ, పరివారానికీ చేసిన సత్కారమూ, దానిని భరతుడు స్వీకరించిన వైఖరి ఒక పండితుడు వివరించాడు.రెండవ పండితుడు సాధారణంగా ఇతర విషయాలను గురించి మాట్లాడుతాడు. ఆయనకూడా ఈ సాయంకాలం నారదుడు వాల్మీకి మహర్షికి రాముని గుణాలు వర్ణించిన అంశం గురించి ఉపన్యసించాడు. రామనామం చాలా మధురం. అందువల్ల మీరంతా ఈ ప్రసంగాలు చక్కగా విని ఆనందించారు. రాముని మహిమవల్ల ఉత్తేజితుడు కానివాడు మాట్లాడితే నీరసంగా ఉంటుంది. అందువల్ల ఎవరికీ లాభం ఉండదు. మధుర పదార్థాలు వడ్డించిన పళ్ళెములతో నిండిన బల్లను అద్దంలో చూచినట్లు ఉంటుంది. అద్దంలో కనిపించిన మధుర పదార్థాల వల్ల ఎవరికీ ఆకలి తీరదు. దివ్యనామం వల్ల పొందగల ఆనందం వర్ణనాతీతం. ఎంత సమర్థులైనవారి పలుకులైనప్పటికీ అందులో ఒక లేశం మాత్రమే వెల్లడించగలుగుతవి.

మానవుడు ఈ లోకంలోనికి మాయను, దాని పరికరమగు మనస్సునూ వెంటబెట్టుకొని వస్తున్నాడు. బాహ్యప్రపంచం పట్ల అనురక్తినీ, రాగద్వేషాలనూ మనస్సు ప్రకటిస్తూ ఉంటుంది. రాగము రాజసికమైనది. నారదుడు భగవంతుని పాదాలమీద స్థిరంగా బుద్ధి నిలవటానికి రాగమును వినియోగించిన విధంగా దానిని మీ ఉద్ధరణకోసం ఉపయోగించుకోవచ్చు. ద్వేషము తామసికము. దుర్వాసుడు అంబరీషుడు మొదలైన వారిపట్ల ప్రదర్శించాడు. రాగద్వేషములు లేకుండా మనస్సు పనిచేయలేదు. ఈ రెండిటినీ తొలగిస్తే మనస్సు, మాయ ఉండవు. స్థిరమైన జ్ఞానం కలగాలి. రాగద్వేషాలు నిష్క్రమించి రాముడు ప్రవేశించాలి. అప్పుడు మనస్సు, మాయ తొలగిపోగలవు. మనస్సును, దాని వ్యాపారాన్ని తైత్తరీయోపనిషత్తు చక్కగా విభజించి చెప్పింది. రాగద్వేషాలను ఎదుర్కొని ఓడించగల సాధనలనూ, మనస్సును భగవంతునిలో లీనంచేసే విధానాలను వివరించింది. నారదునిలాగ, దుర్వాసునిలాగ రాగద్వేషాలను ప్రయోజనాత్మకంగా వినియోగించండి. భగవంతుని పట్ల అనురక్తిని, అహంకారం, గర్వం, పాపం మొదలైనవాటి విషయంలో విరక్తినీ కలిగించుకోవాలి. నిప్పు, నీరు శత్రువులు. నీరు నిప్పును ఆర్పివేయుట నిజమే. కాని, ఆ నిప్పు మీద నీరు కాచినప్పుడు ఆవిరి బయలుదేరును. ఆవిరి బలముతో ఎంతో బరువైన సామాన్ల పెట్టెలను పట్టాలమీద ఈడ్చుకొని పోగలుగుతున్నాము.

రాగద్వేషాలను జయించుటెట్లు? వివేకం, వివేచన, ఆలోచన ద్వారా సత్యాన్ని చేరుకోవాలి. అసత్యం, దురాశ, అసూయలను దుర్యోధనుడు అవలంబించినప్పటికీ ఎగిరే జండాలతో, వ్రేలాడే తోరణాలతో, విందులతో విలాసంగా కాలం గడిపాడు. ఉత్తమ నీతి మార్గంలో నడిచిన యుధిష్ఠిరుడు అరణ్యవాసము, దారిద్ర్యము, కష్టాలూ అనుభవించాడు. ఈవిధంగా వ్రాసిన వ్యాసుడు మోసగాడుగాని, తెలివి లేనివాడుగానీ కాదు. అన్ని కష్టాలలోనూ ధర్మం సుస్థిరంగా నిలబడింది. శ్రద్ధ నిశ్చలంగా, బలంగా వృద్ధిపొందింది. దుర్యోధనుని విషయంలో వైభవాల వల్ల వినయము, వివేకము, జాగురూకతా అలవడలేదు. వారు మరణించి శతాబ్దాలు గడిచినప్పటికీ ఈనాడు మీరు ధర్మరాజును గౌరవిస్తున్నారు. వాల్మీకికూడా రాముడు ఒంటరిగా అడవుల్లో సంచరించినట్లు వర్ణించాడు. కాని, రాముడు ధర్మపథంలో క్షణమైనా తొట్రుపాటు పొందలేదు. ఈనాడుకూడా రాముని ధర్మస్వరూపునిగా పూజిస్తున్నారు. ఈనాడు మంత్రోపదేశం పొందిన బాలలకూ, ఉపదేశంచేసిన గురువులకూ మధ్య గురుశిష్య సంబంధం ఏర్పడింది. దానికీ ఒక ప్రత్యేక ధర్మం ఉంది. దాని ప్రకారం గురువు ప్రేమతో విద్య నేర్పాలి. శిష్యుడు కృతజ్ఞతతో నేర్చుకోవాలి. శిష్యుని ప్రవర్తన సంతృప్తికరంగా లేకపోతే నేర్పినదంతా మరచిపోయేటట్లు చేసిన సందర్భాలు, శిష్యుని తన దగ్గరనుంచి పంపించివేసిన సంఘటనలుకూడా కొన్ని ఉన్నవి.

భారతదేశం యోగభూమి, త్యాగభూమి, వేదభూమి. వ్యక్తిత్వము, సమన్వయము, వైరాగ్యము, ఆధ్యాత్మిక దర్శనమూ అలవర్చిన దేశం ఇది. సమ–ధీ అంటే సమస్త వస్తువులలనూ దివ్యత్వనిలయాలుగా గుర్తించగల సమదృష్టిని భారతదేశం బోధించింది. సమత్వమనేది ఉత్పత్తిమీద, స్వభావంమీద ఆధారపడి ఉంటుంది. చెఱువులో, బావిలో, నదిలో ఉన్నది వర్షజలమే. వాన కురిసిన తావులను బట్టి ఆ నీటిని నింపుకున్న వస్తువుల పరిశుభ్రతను బట్టి, ఆ నీరు రంగులో, రుచిలో వేరుగా కనబడుతుంది. దివ్యానుగ్రహం అందరిపైనా కురిసే నిర్మలమైన వర్షధార. ఆ వర్షాన్ని స్వీకరించి వినియోగించుకోటం మానవుని హృదయపాత్ర మీద ఆధారపడి ఉంటుంది.

పరమాత్ముడు మనిషిని పరీక్షించటం సరదాకోసం కాదు. కష్టాల పరంపర మనిషిమీద పడవేయటం భగవంతునికి సంతోషం కాదు. విద్యార్థి సామర్థ్యం కొలిచేటందుకు పరీక్షలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తీర్ణులైనవారికి మార్కులు, గౌరవాలూ. మీ అభివృద్ధిని కొలిచేటందుకు పరీక్షలు జరపండని కోరుకోవాలి. సుబ్రహ్మణ్య దీక్షితులు భరతునికి స్వాగతం ఇవ్వటంకోసం భరద్వాజ మహర్షి దర్బారు ఏర్పరచి అందులో రత్నఖచిత సింహాసనం అమర్చి, యితర సన్నాహాలు చేసిన విధం వర్ణించాడు. భరతుడు తన మనస్సులోనున్న రాముని సంహాసనంలో ఆసీనునిజేసి తాను వింజమరం విసురుతూ పక్కన నిలిచాడు. భరతుడు ప్రదర్శించిన నిజమైన వైరాగ్య భావాన్ని మహర్షి ప్రశంసించాడు. ఈ ప్రవర్తన వల్ల భరతుని నిజస్వభావం అయోధ్యాపురవాసులు గ్రహించే

అవకాశం కలిగినందులకు ఆయన సంతసించాడు. భరద్వాజ మహర్షి ఏర్పరచిన విందు భరతుడు స్వీకరించలేదు. పరిస్థితుల పరిణామానికి భరతుడు ఎంతో ఖేదం అనుభవిస్తున్నందువల్ల ఆహార పానీయాలను గురించీ, నిద్రను గురించీ అతను ఆలోచించే స్థితిలో లేడు. రాముని కలిసి మాట్లాడే వరకు మంచినీళ్లచుక్కకూడా ముట్టుకోలేదు. రాముని గురించిన భావన ఆయనలో ఎంతో తీవ్రంగా వుంది. అందువల్ల ప్రజలు భరతునిలో రామమూర్తిని దర్శించగలిగిరి. నిరంతర ధ్యానం వల్ల రాముని ప్రతిరూపంగా భరతుడు భాసించాడు. సార్ధకమైన భక్తి అంత గంభీరమైనది. అంతా సవ్యంగా నడిచిపోతున్నప్పుడు మీరు నన్ను స్తుతించెదరు. కాని, ఏదైనా దుఃఖం ఎదురైనప్పుడు నన్ను పాషాణహృదయుడని అంటారు. భగవంతుడు కష్టం కలిగించినా, సుఖం కలిగించినా రెండూ దైవప్రసాదాలుగా నిశ్చల చిత్తంతో మీరు స్వీకరించాలి.

పుత్రాకామేష్టి యజ్ఞహోమంనుంచి వెలువడిన పాయసం నుంచి రాముడు జన్మించినట్లు వర్ణించారు. ఏ అవతారమైనా సరే, ఈ అవతారంకూడా అంతే రక్తమాంసాలనుంచి జన్మించదు. ఇతరుల శరీరాలు జడవస్తునిర్మితాలు. అవతారమూర్తి దేహం చిన్మయం. మానవమాత్రులు పిండాకారంలో క్షీరోదకశాయి. స్వచ్ఛమైన, పవిత్రమైన క్షీరంలో తేలుతూ ఎదుగుతుంది. అందువల్లే అవతార పురుషుడు లోపరహితుడు. లేశమైనా గుణఛాయలు కనబడవు. తను పరలోక గతుడైతే పిండప్రదానంచేసే పుత్రుడు లేనందుకు దశరథుడు చితించాడు. కాని, అందరూ దైవస్వరూపులైనప్పుడు, అందరూ దివ్యత్వముతో నిర్మితమైనప్పుడు తండ్రి ఎవరు? తనయుడెవరు? ఎవరు ఎవరికి ఆహారము అందించవలెను? జ్ఞానం అంతటి ఉన్నత స్థాయికి చేరుకుంటే రాముడే తండ్రి, శాంతమే తల్లి, వైరాగ్యమే పత్ని. ప్రభువే ప్రేమకు కేంద్రమైన పుత్రుడు. అటువంటి పుత్రుని కోరకుండా దశరథడు పున్నామ నరకంనుంచి కాపాడే మగబిడ్డ కావాలనుకున్నాడు. ఈ కోరిక వల్లనే లంకలో సీతాదేవి అగ్నిప్రవేశం చేయబోవు సమయాన దశరథుని ఆత్మ రాముని సమక్షానికి వచ్చింది.

రావణవధ జరిగింది. రాముడు సుగ్రీవుని, లక్ష్మణుని పిలిచి విభీషనునికి లంకారాజ్య పట్టాభిషేకం చేవలసిందన్నాడు. ఆ శుభసమయంలో రాముడే స్వయంగా లంకానగరానికి వచ్చి తనను దీవించవలెనని విభీషణుడు వేడుకొన్నాడు. తన వనవాస దీక్షకు భంగం కులుగునని లంకానగర ప్రవేశం చేయజాలనని రాముడు వక్కాణించాడు. సీతను పల్లకిలో తన స్థావరానికి తోడ్కొని రావలసిందని హనుమంతుని పంపినాడు. తన పనులలో మునిగియున్న విభీషణుడు సీత సంగతి ఆలోచించలేదు. సీతాదేవికి హనుమంతుడు ప్రణామంచేసాడు. క్షీరసముద్రంనుంచి ప్రభవించిన లక్ష్మీదేవిగా ఆమె గోచరించింది. తన జన్మపరంపరలు క్షణంసేపు లభించిన దివ్యదర్శనంవల్ల ధన్యమైనట్లు హనుమంతుడు భావించాడు. అది తన అనేక జన్మలను సార్థకంచేయగల పరిహారంగా భావించాడు. రాముని స్థావరం చేరుకుంటున్న ఆ ప్లలకిలోంచి ఒక మహాతేజస్సు నలుదిక్కులా వ్యాపించింది. అది గమనించిన వానరయోధులు ఆశ్చర్యచకితులయ్యారు. అల్లంత దూరాన పల్లకి దిగి రమ్మని రాముడు కబురు పంపాడు. ఆమె దివ్యతేజస్సును తనివితీరగా వానరవీరులు చూడవలెనని, కన్నుపండువ చేసుకొనవలెనని రాముని తలంపు. ఈ విషయము మీకు ఏ గ్రంథములోనూ కనబడదు.

సీత పదిగజాల దూరంలో ఉండగా రాముడు, 'ఆగు, అగ్ని పరీక్షకు గురియైన తరువాతకాని నిన్ను స్వీకరించను' అన్నాడు. ఆయన కరిగినప్పుడు వెన్న. కఠినత్వం వహించినప్పుడు ఉక్కు. పిడుగుపాటువంటి ఈ మాటలకు లక్ష్మణుడు మూర్ఛపోయాడు. చితి పేర్చుటకు కట్టెలు తెచ్చే వానరులు పుల్లల బరువుకే క్రుంగిపోయారు. అగ్నిపరీక్ష రెండు ప్రయోజనాలు సాధించింది. అన్ని కాలాలలో అవతారపురుషులను అపనిందలపాలుచేసే నాలుకుల వెన్నంటి పీడిస్తవి. వాటిని కాల్చివేసింది. రావణుడు అపరించుటకు మునుపు అగ్ని ప్రవేశంచేసిన అగ్ని పునరుద్ధరించింది.

దశరథుడుకూడా అక్కడికి సీత పవిత్రతకు మూర్తీభావమని రామునికి చెప్పాలని, తన కుమారుని కళ్లారా చూచుకోవాలని పితృహృదయం పొందే ఆరాటం తీర్చుకోవాలని వచ్చాడు. పితృవాక్య పరిపాలనలో రాముడు చాటిన దీక్షను ఆయన పెట్టుకున్నాడు. యుద్ధంలో మరణించిన వానరసైనికులందరూ రణరంగంలో పునర్జీవితులై రాముని చుట్టూ చేరటంకూడా ఆయన చూచాడు. అప్పటికే రాక్షసులందరికీ మోక్షం లభించింది. చివరి శ్వాస విడిచేటప్పుడు వారందరికీ దేవదర్శనం దొరికింది. 'నా పరికారలుగా వినియోగపడుటకు వానరులు జన్మించారు. కనుక, వారికి మరణం లేదు. నా ఆజ్ఞానుసారమే వారికి జననం' అన్నాడు రాముడు.

జనన మరణాలనుంచి తప్పించుకొనుటకు నరులుకూడా భగవంతుని పరికరాలు కావాలి. అహంకారంలో బందీయై జన్మించిన మానవుడు ఆ చెరనుంచి విముక్తిపొందాలి. విశ్వాధారుని తెలుసుకోటం వల్లనే ముక్తి లభ్యంకాగలదు. నేలలో పాతరవేసిన నిక్షేపాన్ని తెలుసుకోలేక ఆ నిధి ఉన్న తావునే ఒక పూరిపాక వేసుకొని పేదరికంతో అల్లాతున్న మనిషిని పోలిన దుస్థితిలో ఈనాడు మానవులున్నారు. తన లోపలనున్న ఆనందం సంగతి తెలియక మానవుడు దుఃఖపడుతున్నాడు. మీరు ఆ దివ్యానంద సీమకుచేర్చే దారి మరచిపోయారు. అందువల్ల నేను ఆ నిక్షేపాన్ని పొందటానికి కావలిసిన తాళపుచెవి మీకు అందించటానికి, మీలోపలనున్న ఆనందాన్ని ప్రవహింపచేయటానికీ వచ్చాను. మిమ్మల్ని రక్షించుకోటానికి ఇదే చక్కని అవకాశం. దీన్ని వ్యర్థంచేసుకుంటే మీరు దురదృష్టవంతులు.

మీలో అధిక సంఖ్యాకులు నా వద్దనుంచి విలువలేనివాటిని పొందటానికి వచ్చారు. ప్రాపంచిక సుఖాలు, సంతోషాలు, వ్యాధినివారణలు, ఉద్యోగాభివృద్ధులు ఇవన్నీ ఆకర్షణీయంగా కనిపించే కాకిబంగారపు నగలు. నేను మీకు మోక్షం అందించుటకు అవతరించితిని. కాని, దానిని కోరువారు కొద్దిమంది మాత్రమే. వారిలోకూడా సాధనామార్గాన్ని విడవక లక్ష్యం సాధించేవారి సంఖ్య అతిస్వల్పం. అనేకులు సాధువుల బాహ్యలక్షణాలు చూచి ఆకర్షింపబడుతున్నారు. కాషాయరంగు గౌను, జడలు కట్టిన జుట్టు, గడ్డము, రుద్రాక్షలు ధరించేవారు మనదేశంలో ఎంతోమంది సంచరించుతున్నారు. వారిని అనుసరించినవారు అడవులపాలౌతున్నారు.

భగవంతుని లక్షణాలు స్పష్టంగా తెలుకోటం కష్టం. కనుక, నన్ను నేనే ప్రకటించుకొనుచూ నా ఉద్యమమును, లక్ష్యమును, లక్షణములనూ పేర్కొనుచున్నాను. ఈ లక్షణముల వలన అవతారపురుషుని ప్రత్యేకముగా తదితరులకంటే భిన్నమైనవానిగా గుర్తింపగలరు. సుఖాలకోసం, సంపదలకోసం ఆరాటపడకండి. ఆనందంకోసం పరితపించండి. భగవంతుని పట్ల విశ్వాసం ఉంటే, రామనామము ఎడబాయని సహచరునిగా మీరు భావిస్తే సర్వకాలములలో మీరు వైకుంఠములో, కైలాసములో, స్వర్గములో ఉన్నట్లే. అవి కష్టపడి ప్రయాణంచేసి చేరుకోగలిగిన దూరప్రదేశాలు కావు. అవి మీ హృదయాలలోనే ఉన్న శాంతిధామాలు. ఇంకేతావునందూ మీకు అన్ని మహదానందములకూ మూలకందమైన ఈ సన్నిధానం లభించదు. ఇంత సన్నిహితంగా మెలిగే అవకాశం చిక్కదు. ఇక్కడ ఇంత సన్నిహితంగా, ఇంత సులభంగా, ఇంత అనుగ్రహపూర్వకంగా మీకు లభిస్తున్నది. మీరు వెనుక అడుగు వేస్తే ఇటువంటి అవకాశం మరల దొరకదు. మిమ్మల్ని రక్షించే వస్తువును అడిగి అందుకోండి. మిమ్ము బంధించే విషయాలు కోరుకోవద్దు. ఒక చెయ్యి ప్రాపంచిక విషయాలకోసం నన్ను అడుగుతున్నారు. నేను కావాలని అడిగేవారు అరుదు. అందుకే, నేను ఎప్పుడూ మిమ్ము 'భక్తులారా' అని సంబోధించను. 'దివ్యాత్మస్వరూపులారా' అంటాను. అదే మీ నిజస్వరూపం కనుక. మీరు గుర్తించుకోలేకపోయినా అదే అసలు రూపం. అందుకే నేను మిమ్మల్ని 'దివ్యాత్మస్వరూపులారా' అని నిశ్చయంగా సంబోధించగలను. కాని, భక్తులారా అని సంబోధించుటకు వేరు అర్హత ఉండాలి. భగవంతుని తప్ప యింక దేనినీ కోరనివాడే భక్తుడు. అటువంటి అర్హత మీరు సంపాదించుకోలేదు. సాయిభక్తులమని, రామభక్తులమని, కృష్ణభక్తులమని మీరు చెప్పుకుంటారు. మీరు భగవంతునికి సంపూర్ణంగా శరణాగతులై ఆయన ఉపకరణాలు కావాలి. అప్పటిదాకా భక్తులమని చెప్పుకొనే అర్హత మీకు కలగదు.

ఉదాహరణకు భరతుడు రామభక్తుడనని చేప్పుకోవచ్చును. ఆయన ప్రతి శ్వాసలోనూ రాముడే. రామునివలె నారచీరలు ధరించి ఋషిలాగ జీవించాడు. అందువల్లనే రామునివలె భరతుడు శ్యామశరీరుడైనాడు. రావణ లక్షణాలను శ్రవణ, మనన, నిధిధ్యాసల ద్వారా అరికట్టాలి. విన్న దానిని మననం చేయాలి. వాటివల్ల మార్పుచెందిన మనస్సు చేసే ఆదేశాలకు అనుగుణంగా ఆచరణలు ఉండాలి. కామక్రోధాలు, ప్రాపంచిక విషయాలపైన మితిమీరిన మమకారము, ఇంద్రియసుఖాపేక్ష, అహంకారభావమూ మొదలైన ప్రమాదకర లక్షణాలు రావణతత్త్వమునకు చెందినవి.

పొయ్యిమీది గిన్నెలో పాలు పొంగుతుంటే చల్లని నీరు జల్లుతారు. అది వెంటనే తగ్గిపోయి గిన్నెలో సర్దుకుంటుంది. పొంగిపోయే పాలు దుర్వాసుడు. పొంగిపోని పాలు నారదుడు. నాలుకమీద నిరంతరం భగవన్నామం నాట్యంచేస్తున్నందువల్ల నారదుడు ఇంద్రియాలకు వశుడైపోలేదు. మీ ఇంద్రియాలను, కోరికలనూ అదుపుచేసుకుంటే మీరిక్కడికి వచ్చి ఈ ప్రసంగాలు విన్నందుకు సత్ఫలితం కలగినట్లు. నిజమైన బలము, సంతోషమూ అందించగల నవ్యమార్గంలో మీరు నడక సాగిస్తే నేను ఆనందిస్తాను.